RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 269 ISSUE NO : 269 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం, ఏప్రిల్,23, 2026 Thursday, April, 23, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## శివ భక్తులకు తీపికబురు.. తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయం..

ఉత్తరాఖండ్: ఆరు నెలల సుదీర్ఘ శీతాకాల విరామం తర్వాత, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు బుధవారం ఉదయం సరిగ్గా 8 గం టలకు భక్తుల దర్శనం కోసం తెరుచుకున్నాయి. అక్షయ తృతీయ శుభ ఘడియల్లో వేద మంత్రోచ్ఛారణలు, శంఖారా వాల మధ్య బాబా కేదార్‌నాథ్ ఆలయ కపాటాలు తెరుచుకోవడంతో చార్‌ధామ్ యాత్రలో కీలకఘట్టం ప్రారంభమైంది.

# పహల్గామ్ నెత్తుటి జ్ఞాపకం..

## ఏడాది తర్వాత కూడా వీడని విషాదం.. ప్రధాని మోదీ భావోద్వేగ ట్వీట్

ఢిల్లీ,: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన అత్యంత హేయమైన ఉగ్రదాడికి నేటితో సరిగ్గా ఏడాది పూర్తయ్యింది. 2025 ఏప్రిల్ 22న జరిగిన ఈ దుర్ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకరమైన రోజుపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా భావోద్వేగంగా స్పందించారు. దాడిలో మరణించిన వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు దేశం మొత్తం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉగ్రవాదంపై భారత్ తన పోరాటంలో ఎప్పటికీ వెనకడుగు వేయదన్నారు.



- 'ఎక్స్' వేదికగా అమరులను స్మరించుకున్న ప్రధాని మోదీ
- ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని స్పష్టీకరణ
- ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్



## అగ్నిగుండంగా.. భారత్

### ప్రపంచంలోని 20 హాటెస్ట్ నగరాల్లో 19 మనవే!

- బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఏప్రిల్ 24 వరకు వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిక...

ఢిల్లీ,: ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రత లకు భారత్ కేంద్రంగా మారింది. ఏప్రిల్ 21న AQI.in విడుదల చేసిన డేటా ప్రకారం ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల జాబితాను పరిశీలిస్తే అందులో 19 నగరాలు భారత్‌లోనే ఉన్నాయి. దేశంలోని ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. వీటితో పాటు బిహార్‌లోని బెగుసరాయ్, మోతిహారి,ముంగేర్, భోజ్‌పూర్, సివాన్ లతో పాటు పశ్చిమ బెంగాల్, తూర్పు ఉత్తరప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈజాబితాలో భారత్ వెలుపల ఉన్న ఏకైక ప్రాంతం నేపాల్‌లోని లుంబిని కావడం గమనార్హం.



## ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగింపు

### దిగ్బంధం కొనసాగింపు

### ట్రంప్ కీలక ప్రకటన

- ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగించిన ట్రంప్
- అయితే పోర్టుల దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టీకరణ
- పాకిస్థాన్ నేతల అభ్యర్థన మేరకే ఈ నిర్ణయమన్న అమెరికా అధ్యక్షుడు
- ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని వ్యాఖ్య
- పాకిస్థాన్‌లో జరగాల్సిన శాంతి చర్చలకు వైస్ ప్రెసిడెంట్ దూరం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటిం చారు. అయితే, అదే సమయంలో ఇరాన్ పోర్టులపై అమెరికా నౌకాదళ దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌పై దాడిని వాయిదా వేసినట్లు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. "ఇరాన్ ప్రభుత్వంలో తీవ్ర స్థాయిలో విభేదాలు ఉన్నాయి. వారు ఒక ఏకాభిప్రాయంతో ప్రతిపాదనతో ముందుకు వచ్చే వరకు సమయం ఇవ్వాలని పాక్ నేతలు కోరారు" అని ట్రంప్ పేర్కొన్నారు. గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ట్రంప్ ఈ కాల్పుల విరమణ పొడిగింపు నిర్ణయాన్ని ప్రకటించారు.



## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

హైదరాబాద్,తెలంగాణ దిశ : నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపు తున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిం చింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యా చరణను ఖరారు చేసేందుకు కేబినేట్ లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

### కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం




## అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి.. రూ.148 కోట్లు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

### రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం





## కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్, హరీష్‌లకు ఊరట

### జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్,,తెలంగాణ దిశ :కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే..



## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ,తెలంగాణ దిశ : కాళేశ్వ రం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిం దని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమి షన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్ల ను మెన్షన్ చేయలేదని చెప్పుకొ చ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భ ంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

# అక్రిడిటేషన్ల జారీలో సర్కారు అట్టర్ ఫ్లాప్

## - పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటం
## - టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య



**మహబూబ్ నగర్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన కొత్త అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా కనీసం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్ నగర్ లోని కెమిస్ట్ డ్రగిస్ట్ భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వధంగా ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతుందని అన్నారు. గడిచిన రెండేళ్లలో జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అనేది మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులిస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమయ్యిందని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ఊసే లేదని, చిన్న మధ్య తరహా పత్రికలకు రెఃడేళ్ళుగా అడ్వర్టైజ్మెంట్ల బిల్స్ ఇవ్వడంలేదని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టి ఐక్యంగా హక్కులను సాధించుకోవాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వాకిట అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, ఎం. యాదగిరి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మోయిజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ రఫీ, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నర్సింహ్మా, కార్యదర్శి ఎం. గోపాల్, కోశాధికారి నర్సింహులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవి కుమార్, కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 26న శ్రీనివాస నగర కాలనీ పార్కులో హిందూ సమ్మేళనం




**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ పార్క్--1లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కాలనీ అధ్యక్షుడు, ఆహ్వాన సమితి ఉపాధ్యక్షులు సత్యనారాయణ (నాగు) తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, కాలనీ వాసులు, పరిసర కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. ఈ సమ్మేళనంలో సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, దేశభక్తి విలువలపై ప్రముఖులు ప్రసంగించనున్నారని తెలిపారు. సమాజంలో సనాతన ధర్మం ప్రాముఖ్యతను తెలియజేస్తూ, యువతలో జాతీయ చైతన్యం పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా ప్రముఖ వక్తలు పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణ, సమాజ అభివృద్ధి, జాతీయ ఐక్యతపై అవగాహన కల్పించానన్నారని తెలిపారు. అదే విధంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమ్మేళనంలో భాగంగా భక్తి గీతాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి, హిందూ సంస్కృతి గొప్పతనాన్ని చాటి చెప్పనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రాష్ట్రపతి నిలయంలో విద్యార్థులకు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ లపై శిక్షణ

## - 620 మంది విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన



**సికింద్రాబాద్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :బోలారంలోని రాష్ట్రపతి నిలయంలో హ్యాండ్స్-ఆన్ హార్ట్ సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 16 విద్యాసంస్థల నుండి వచ్చిన 620 మంది వివిధ పాఠశాలు, కళాశా లలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రపతి నిలయం సిబ్బంది కూడా ఈ శిక్షణలో భాగమయ్యారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ రోట్రాక్ట్ క్లబ్‌కు చెందిన వైద్య నిపుణులు, మెడికల్ విద్యార్థుల పర్యవేక్షణలో ఈ శిక్షణ జరిగింది. గుండె ఆపత్కాల పరిస్థితుల్లో తక్షణ స్పందన ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమంలో వివరించారు. ఉస్మానియా జనరల్, ఛెస్ట్ ఆసుపత్రికి చెందిన కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిత భల్లా నేతృత్వంలో



సీపీఆర్ పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. మానికిన్ల సహాయంతో సరైన చేతి స్థానం, ఛాతీపై ఒత్తిడి (కంప్రెషన్) లోతు, రక్షణ శ్వాస (రెస్క్యూ బ్రీథింగ్) వంటి కీలక అంశాలను వివరించారు. విద్యార్థులు స్వయంగా మానికిన్లపై ప్రాక్టీస్ చేసి సీపీఆర్ పద్ధతులను నేర్చుకున్నారు. రాష్ట్రపతి నిలయం సిబ్బంది, భద్రతా సిబ్బందికి కూడా ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ విధానాలపై సమగ్ర శిక్షణ అందించారు. అత్యవసర పరిస్థితుల్లో




వేగంగా స్పందించాల్సిన అవసరాన్ని నిపుణులు వివరించారు. ఏప్రిల్ 23 గురువారం అగ్నిమాపక భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె. రజని ప్రియా మాట్లాడుతూ సమాజంలో ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు రాష్ట్రపతి నిలయం సంవత్సరమంతా అందుబాటులో ఉంటుందని అన్నారు. సోమవారాలు, ప్రభుత్వ సెలవు రోజులు మినహా సందర్శకులు ఆన్ లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

# మహిళా సమాఖ్యల సమస్యలను పరిష్కరించాలి

## - మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :మహిళా సమాఖ్యలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మహిళా కాంగ్రెస్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి కోరారు. ఈ మేరకు బుధవారం కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో సీఈవో బాలరాజుతో సమావేశమై మహిళా సమాఖ్యల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల కాలంలో బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, వడ్డీ భారం, మార్కెటింగ్ సదుపాయాల లోపం, ప్రభుత్వ పథకాల అమలులో ఆలస్యం వంటి సమస్యలతో మహిళా సమాఖ్యలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. ప్రత్యేకంగా కొంపల్లి సర్కిల్ పరిధిలో మహిళా సంఘాలకు సంబంధించిన పలు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ సంఘాలు ముఖ్యమైన వేదికలని, వాటి బలోపేతానికి ప్రభుత్వం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు సమయానికి రుణాలు అందేలా



చూడడం, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించడం వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ సీఈవో బాలరాజు మహిళా సమాఖ్యల సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షురాలు ఖనీస్ ఫాతిమా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షురాలు నాగశిరోమణి, కార్యదర్శులు వనిత, సమీన, వందన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా యువజన క్రీడోత్సవాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా యువజన క్రీడా కార్యక్రమాలను మే 18 నుండి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రధాన లక్ష్యం ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లడమని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని వివరించారు. మే 1 నుండి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మే 18 నుండి 23 వరకు యువజన కేంద్రీకృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వాటిలో మే 18న రాష్ట్ర వ్యాప్తంగా మరథాన్ రన్, ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు, మే 19న కెరీర్, స్కిల్ డెవలప్‌మెంట్ డే, మే 20న యూత్ లీడర్‌షిప్ సమ్మిట్స్, మే 21న క్రీడా దినోత్సవం, మే 22న యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ -- సర్వ్ అండ్ సపోర్ట్ కార్యక్రమం, మే 23న ఉద్యోగ సాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో యువజనులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యేలా



జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనిబాలా దేవి మాట్లాడుతూ ఇటీవల సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్‌ను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో నిర్వహించగా సుమారు 5.64 లక్షల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువజనులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డా. సోనిబాలా దేవి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, యువజన సర్వీసులు జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవితేజ, టాస్క్ సీఈఓ నితిన్ రెడ్డి, డిఐడి అధికారి రాజేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ పిఆర్ఓ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల సమస్యలను పరిష్కరించాలి

## - మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 26, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల సమస్యపై మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన (ఐఏఎస్)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఈ కాలనీలలో 30 సంవత్సరాల క్రితమే నిర్మించుకున్న ఇళ్లకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ, వాటిని అక్రమ నిర్మాణాలుగా పేర్కొంటూ మున్సిపల్ సిబ్బంది భారీ జరిమానాలు విధిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విధిస్తున్న జరిమానాలను తక్షణమే ఉపసంహరించి, కాలనీ వాసులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కమిషనర్ సృజన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సందర్భంలో కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా శ్రీశైలం గౌడ్



కమిషనర్‌కు వివరాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినప్పటికీ, టెండర్ ప్రక్రియలో నిలిచిపోయిన పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ కూడా పాల్గొన్నారు. అలాగే కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆగం పాండు, శ్రీనివాస్ రెడ్డి, మోటే శ్రీనివాస యాదవ్, అరువ వెంకట్, సాయికిరణ్, గోపాల్ రెడ్డి, గుమస్తా మధుసూదన్, వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డికి మహిళా కాంగ్రెస్ నేతల అభినందనలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ వైస్ చైర్మన్‌గా నియమితులైన బొంగునూరి కిషోర్ రెడ్డిని మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా నాయకురాళ్లు ఘనంగా సన్మానించారు. బుధవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజాల రమ్య, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షురాలు ఖనీస్ ఫాతిమా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షురాలు నాగశిరోమణి, కార్యదర్శులు వనిత, సమీన, వందన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ ప్రజా సేవలో విశేష అనుభవం కలిగిన బొంగునూరి కిషోర్ రెడ్డికి ప్రోటోకాల్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రోటోకాల్ వ్యవహారాల్లో ఆయన సమర్థంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొని ప్రజలకు సేవ చేయాలని ఆమె ఆకాంక్షించారు.



# కాసులు కురిపిస్తున్న ఓపెన్ బార్లు

హైదరాబాద్,:మామూళ్ళ మత్తులో అధికారులు తూగుతు ఒడగా మద్యం దుకాణ వ్యాపారులు ఇష్టారీతిగా దందా కొనసాగిస్తూ భారీ స్థాయిలో వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతున్నారు. నిబంధనలను పక్కనబెట్టి వైన్స్ మాఫియా పెట్రేగిపోతుంది.

రామ చంద్రపురం మండల పరిధిలో వైన్స్ షాపుల చుట్టూ జరుగు తున్న అక్రమాలు రోజురోజుకూ బహిరంగ రూపం దాల్చుతున్నాయి. పార్కింగ్ పేరుతో చూపిస్తున్న ప్రదేశాలు పూర్తిస్థాయి ఓపెన్ బార్లుగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో కూర్చొని మద్యం సేవించడం, కార్ల దగ్గరకే మద్యం సరఫరా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్లను ఆసరాగా చేసుకుని ఓపెన్ ప్లేస్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచ్ల వీక్షణ పేరుతో టేబుల్లను, కుర్చీలు ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవనానికి అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు

ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున గుంపులుగా చేరి హంగామా చేస్తున్నట్లు చెబుతున్నారు.

# సంపాదకీయం

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం..

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటల పాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..! ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..! నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..! అమెరికా– ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండు వారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతో పాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళనలు నెలకొన్నాయి.అమెరికా– ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా హూతీలు, హెజ్‌బొల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి.హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్లు ఆ దేశం చెప్పుకొచ్చింది. ఈ ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఒక వార్తా కథనం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పెను చర్చకు దారితీసింది. తమ నిబంధనలకు టెహ్రాన్ లొంగని పక్షంలో, ఇరాన్ నౌకలను సముద్ర మార్గంలోనే అడ్డుకునే 'నౌకాదళ దిగ్బంధనం' అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొందిఒకవేళ ఈ ప్లాన్ అమలైతే, ఇరాన్ నౌకలు రేవుల నుంచి ముందుకు వెళ్ళలేవు. దీనివల్ల ఆ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. కేవలం ఇరాన్‌కే కాకుండా, ఆ దేశం నుండి పెద్ద ఎత్తున చమురును కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.గతంలో వెనిజులా మాజీ అధ్యక్షుడు మదురోను లొంగదీసుకోవడానికి అమెరికా ఇదే విధమైన నౌకాదళ దిగ్బంధనాన్ని అమలు చేసి విజయం సాధించింది. అదే తరహా వ్యూహాన్ని ఇప్పుడు ఇరాన్‌పై కూడా ట్రంప్ అమలు చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా అంచనా వేస్తోంది. పాకిస్థాన్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్లు అధికారికంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం మీడియా కథనం మాత్రమేనా లేక అమెరికా తదుపరి కార్యాచరణకు ఇది పరోక్ష సంకేతమా అని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తన పోస్ట్ ద్వారా ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది.తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు. ఆరోపణలపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చైనా ఇరాన్‌కు ఆయుధాలు పంపడం మానుకోవాలని, లేకపోతే బీజింగ్‌కు 'వినాశకర పరిణామాలు' తప్పవని హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనాకు 200% టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని గతంలోనే ప్రకటించిన ట్రంప్, ఈసారి మరింత కఠినంగా మాట్లాడారు. 'మాకు నాటో నుంచి ఎటువంటి సాయం లభించలేదు. అయినా ఇరాన్‌ను సైనికపరంగా ఓడించాం. చర్చలు విఫలమైనా అంతిమ విజయం మాదే,' అని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను 'తుడిచిపెట్టేస్తామని' ఆయన బహిరంగంగా హెచ్చరించారు.వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే, ఇరాన్ అధికారికంగా చైనా ఆయుధాలు అందినట్లు వెల్లడించకపోయినా, తమ వద్ద ఉన్న ఆధునిక వ్యవస్థల సామర్థ్యాన్ని బట్టి చూస్తే చైనా సాయం స్పష్టంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాకు ఇరాన్ నుంచి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల ముడిచమురు సరఫరా అవుతోంది. ఈ ఆర్థిక బంధమే చైనా ఇరాన్‌కు రహస్య సాయం చేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తున్నాయి. చైనా?ఇరాన్ బంధం మరింత బలపడటం, ఆర్థిక, సైనిక సహకారం పెరగడం వల్ల అమెరికాకు ఇది సవాల్‌గా మారింది. నాటో దేశాలు ఈ యుద్ధంలో అమెరికాకు సాయం చేయకపోవడంతో అగ్రరాజ్యం ఒంటరిగా మారింది. హర్మూజ్ గుండా చమురు రవాణా ఆలస్యం కావడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది.చైనా ఆయుధ సరఫరా ఇరాన్‌కు ఊపిరి పోసింది. అమెరికా సైనికపరంగా విజయం సాధించినా, చర్చలు విఫలమవడం మరియు చైనా రహస్య సాయం యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేశాయి. ట్రంప్ హెచ్చరికలను చైనా లెక్కచేయకపోతే, అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరే ప్రమాదం ఉంది. హర్మూజ్ జలసంధి తెరవడం, ఇరాన్‌తో చర్చలు విజయ వంతం కావడంపై మధ్యప్రాచ్య భవిష్యత్ ఆధారపడి ఉంది.పశ్చిమాసియా యుద్ధం మరింత విస్తరిస్తే.. అది భారత్‌కూ ఇబ్బందే. మన దేశ ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. చమురు, సహజవాయువు సరఫరాలకు అంతరాయం కలిగితే.. దేశ ఆర్థిక వ్యవస్థపై అది తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# దేశంలో భారీగా పెరగనున్న లోక్‌సభ స్థానాలు


ఢిల్లీ: కొత్త జనాభా లెక్కలు రావడానికి ముందే డీలిమిటేషన్ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850 సీట్ల వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో 815 స్థానాలు రాష్ట్రాల నుంచి, 35 స్థానాలు యూటీల నుంచి ఉండనున్నాయి. లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యం వాటాలో ఎలాంటి మార్పు లేకుండా ఈ పెరుగుదల ఉండనుంది. అన్ని రాష్ట్రాలకు సమాన శాతాల్లో లోక్‌సభ సీట్ల పెరుగుదల ఉంటుంది. అంటే ప్రతి రాష్ట్రంలో ఇదివరకున్న ఎంపీ సీట్లల్లో 50 శాతం మేరకు పెరుగుదల ఉంటుందని తెలుస్తోంది. కాగా, పెరిగిన ఈ సీట్లకు అనుగుణంగా 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను 2029 పార్లమెంటు ఎన్నికలకు ముందు నుంచే కేంద్రం అమలు చేయనుంది. లోక్‌సభతోపాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీ స్థానాల పునర్విభజన సైతం చేపట్టనుంది. ఆ చట్టసభల్లోనూ 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయనుంది. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను సిద్ధం చేసి ఎంపీలకు అందించింది. నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ సవరణలను ప్రవేశపెట్టి ఆమోదించుకోనుంది.

సెన్సస్ నుంచి డీలిమిటేషన్ కేంద్రంగా..: రాజ్యాంగంలో నిబంధనలు ప్రకారం, పునర్విభజన ప్రక్రియ చేపట్టాలంటే ముందుగా జనగణన చేపట్టాలి. ఆ జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి. ఆ తర్వాత మహిళా కోటాను అమలు చేయాలి. సాధారణంగా ప్రక్రియ ఇలా జరగాలి. ఇలా ఇది వరకు జనాభా కేంద్రంగా ప్రక్రియ సాగేది. కానీ, ఈ సారి దాన్ని డీలిమిటేషన్ కేంద్రంగా మార్చినట్లు తెలుస్తోంది. జనాభా లెక్కలు పూర్తి కావడానికి ముందే గత జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2023లో చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. తదుపరిగా జరిగే జనగణన తర్వాత అమల్లోకి తేవాలనే నిబంధన చట్టంలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన జనగణన పూర్తయ్యాక డీలిమిటేషన్ చేపట్టాల్సి ఉంది. 2027లో జనగణన ప్రక్రియ పూర్తవ్వనుండగా.. గణాంకాలు ఆ తర్వాత అందుబాటులోకి రానున్నాయి. అనంతరం, డీలిమిటేషన్.. ఆ తర్వాత మహిళా కోటాను అమలు చేయాలి. అలా చేస్తే 2029 పార్లమెంటు ఎన్నికల వ్యవధి సైతం దాటే చాన్స్ ఉన్నది. అందుకే భారత ప్రజాస్వామ్యంలో మహిళా శక్తి భాగస్వామ్యాన్ని మరింత దీర్ఘకాలం వాయిదా వేయకూడదనే ఉద్దేశంతో కొత్త సవరణలు తెస్తున్నట్టు తాజా డ్రాఫ్ట్ బిల్లులో కేంద్రం తెలిపింది. ఇందుకోసం అవసరమైన రాజ్యాంగ సవరణలతో మూడు బిల్లులను సిద్ధం చేసింది.

కీలక సవరణలు..: అవాంతరాలను అధిగమించి జనగణన పూర్తికావడానికి ముందే.. అంటే గత జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ చేపట్టి.. 2029 ఎన్నికలకు ముందే మహిళా కోటా అమలు చేయడానికి కేంద్రం మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను సిద్ధం చేసింది. 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026, డీలిమిటేషన్ బిల్లు 2026, యూటీ చట్టాల సవరణ బిల్లు 2026ను పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులతో 2023లో ఆమోదించిన మహిళా కోటా చట్ట అమలుకు జనగణన, డీలిమిటేషన్‌తో లంకె తెంచనుంది. డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా పార్లమెంటులో సూచించిన జనాభా లెక్కలను స్వీకరించే నిబంధన తేనుంది. డీలిమిటేషన్‌పై 2026 వరకున్న ఫ్రీజ్‌ను తొలగించి, ప్రస్తుతం గరిష్ట లోక్‌సభ సీట్ల సంఖ్యను 550 నుంచి 850 వరకు పెంచే వెసులుబాటును తీసుకురానుంది.

131వ రాజ్యాంగ సవరణతో ఆర్టికల్ 81ను సవరించి లోక్‌సభ సీట్ల సంఖ్యను 550 నుంచి 850కు కేంద్రం పెంచనుంది. 1971 జనగణనకు లోబడని లోక్‌సభ సీట్ల సంఖ్య, 2001 జనగణనకు లోబడిన అసెంబ్లీల సీట్ల సంఖ్యపై ఆర్టికల్ 81(2), (3)లతో ఫ్రీజ్ అమల్లో ఉన్నది. దీన్ని పైసవరణ తొలగిస్తుంది. ప్రతిజనగణన తర్వాత పునర్విభజన అనే పదాన్నిపునర్విభజనగా మార్చడానికి, ప్రతి జనగణన తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పదాన్ని తొలగించడానికి ఆర్టికల్ 82ను సవరిస్తున్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు సంబంధించి పార్లమెంటు సూచించిన జనగణన అనే పదాన్ని పై సవరణతో చేరుస్తున్నారు. మొత్తంగా ఆర్టికల్ 82, 170 సవరణలతో 2026 తర్వాత చేపట్టే జనగణన అనే తప్పనిసరి నిబంధనను తొలగిస్తూ.. గత జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన అధికారాన్ని డీలిమిటేషన్ కమిషన్‌కు కల్పించనుంది.

సుప్రీం జడ్జీ చైర్మన్‌గా కమిషన్..: ఈ మహా కార్యం చేపట్టడానికి బిల్లులు ప్రత్యేకంగా ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాయి. ఇందుకోసం




సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటవుతుంది. ఇందులో సీఈసీ, రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ సివిల్ కోర్ట్ హోదాను కలిగి ఉంటుంది. రాష్ట్రాల్లో సీట్ల కేటాయింపులు, నియోజకవర్గ పరిధుల పునర్విభజనలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను నిర్ధారిస్తుంది.

మహిళా కోటా.. రొటేషన్..: ఈ చట్టం అమల్లోకి వచ్చాక పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో మొత్తంగా 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు అమలవుతాయి. ఎస్సీ, ఎస్టీ కోటాల్లోనూ 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది. ప్రతి డీలిమిటేషన్ తర్వాత మహిళా కోటా రొటేషన్ అమలవుతుంది. మహిళా రిజర్వేషన్ 15 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత పార్లమెంటు ద్వారా అవసరమైన మేరకు పొడిగించుకునే వెసులుబాటు ఉంటుంది. మహిళా చట్టం 2023 ప్రకారం 2026 తర్వాత చేపట్టే జనగణన లెక్కల ఆధారంగా కోటా నిర్ణయించాలి. ఇది సుదీర్ఘకాలం మహిళా కోటాను వాయిదా వేసినట్టు అవుతుందని, అందుకే ముందస్తుగా అమలు చేయడానికి సవరణలు తెచ్చినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘవాల్ వివరించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక జరిగే రాష్ట్రాల అసెంబ్లీలు, ఉపఎన్నికలకు సైతం మహిళా కోట అమలవుతుందని స్పష్టం చేశారు. అంటే 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచే మహిళా కోటా అమల్లోకి రావొచ్చని వివరించారు.

అసెంబ్లీ సీట్లు 500 దాటొద్దు:ఆర్టికల్ 333 ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు గరిష్టంగా 500కు మించకూడదు. అలాగే, 60కి తక్కువగా ఉండకూడదు. ఈ షరతును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల నియోజవకర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంటుంది. ప్రతి నియోజక వర్గానికి దాదాపుగా సమాన ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్త వహించాలి.

## పదవ తరగతి విద్యార్థులకు ఉచిత డిప్లొమా కోర్సుల అవగాహన సదస్సు

భువనగిరి, ఏప్రిల్ 26, (తెలంగాణ దిశ) :పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ భవిష్యత్ విద్యా మార్గాన్ని సరైన దిశలో ఎంచుకునేందుకు సహాయపడే ఉచిత అవగాహన సదస్సు భువనగిరిలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని భువనగిరి డెవలప్ మెంట్ ఫోరమ్, మైత్రి అకాడమీ, నల్గొండ సంయుక్తధ్వర్యంలో యాదాద్రి భువనగిరి ట్రస్మ సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సులో సిఐటిడి, సిఐపిఈటి, పాలిటెక్నిక్ కోర్సులపై పూర్తి వివరాలతో అవగాహన కల్పించనున్నారు. కోర్సుల ప్రాముఖ్యత, వాటి ద్వారా లభించే ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ కెరీర్ మార్గాలపై నిపుణులు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించనున్నారు. విద్యార్థుల ప్రతిభను అంచనా వేసేందుకు ఉచితంగా పాలిటెక్నిక్ మాక్ టెస్ట్ కూడా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతి రూ. 2500, రెండవ బహుమతి రూ. 1500, మూడవ బహుమతి రూ. 1000గా నిర్ణయించారు.ఈ కార్యక్రమం ఈ నెల 26 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు, భువనగిరిలోని శ్రీ వైష్ణవి జూనియర్ కాలేజీలో జరగనుంది. ఈ సందర్భంగా మైత్రి



అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ పదవ తరగతి తర్వాత చాలా మంది విద్యార్థులు ఏ కోర్సు తీసుకోవాలో తెలియక సందిగ్ధంలో ఉంటారని, అలాంటి వారికి సరైన మార్గదర్శకత్వం చాలా అవసరమన్నారు. ఈ ఉచిత సదస్సు ద్వారా విద్యార్థులు స్పష్టమైన దిశను పొందుతారని అన్నారు. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకునే విద్యార్థులు, తల్లిదండ్రులు 93 93 94 94 97 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## నేడు, రేపు హైదరాబాదులో ఎన్ యు జె (ఐ)జాతీయ మహాసభలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, (తెలంగాణ దిశ)** :నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా)ఎన్ యుజె (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 23, 24 తేదీలలో నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్ హోటల్ శ్రీ వేద ప్రీమియంలో ఏర్పాటు చేసినట్లు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ తెలిపారు. జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా 23వ తేదీ ఉదయం 10 గంటలకు 'తెలంగాణ రైజింగ్: ప్రోగ్రెస్ జర్నీ – మీడియా విట్నెస్' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వివరించారు. అదేవిధంగా ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ విశిష్ట అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. రెండు రోజులపాటు జరుగనున్న జాతీయ కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



## వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్, తెలంగాణ దిశ** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూ చించారు. సాధారణ స్థాయికి మించి 1.5శీజ నుండి 3.5శీజ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్ల లు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధంచేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించా రు.



## పిల్లలకు జంకు ఫుడ్ పై అవగాహన ర్యాలీ

**జగిత్యాల/వెల్గటూర్,తెలంగాణ దిశ:** పోషణ పఖ్వాడా కార్యక్రమం సందర్భంగా, వెల్గటూర్ వన్ సెక్టార్ పరిధిలోని రాజక్కపల్లి అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం మాట్లాడుతూ పిల్లలను చిన్న వయస్సు నుంచే మంచి విలువలతో పెంచి, వారికి ఉత్తమ విద్యను అందించాలని సూచించారు. పిల్లలు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ, ఆరు సంవత్సరాల లోపు పిల్లల మెదడు సుమారు 80 శాతం వరకు అభివృద్ధి చెందుతుందని, ఈ కీలక దశలో పిల్లలకు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం అందించడం అత్యంత అవసరమని తెలిపారు. అలాగే, సరైన సమయంలో పిల్లల వయసుకు తగిన బరువు, ఎత్తు పెరుగుదల జరుగుతున్నాయా లేదా, అలాగే సరైన సమయంలో నడవడం, మాట్లాడడం, పరుగెత్తడం వంటి అభివృద్ధి మైలురాళ్లు సాధిస్తున్నారా లేదా అనే విషయాలను తల్లిదండ్రులు తప్పకుండా గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి, గ్రామ పాలక మండలి సభ్యులు బొడ్డు రమేష్, బోడకుంటి తిరుపతి, బోడకుంటి పోచయ్య, కొల్లూరి జితేందర్ , అంగన్వాడి టీచర్ దోరిశెట్టి తిరుమల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగరాజు, పిల్లల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ... జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన

**నిర్మల్,తెలంగాణ దిశ:** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు.



# ఈ పండ్లను మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## వీటి లాబాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు..!

స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్ బెర్రీ.. ఇలా అనేక రకాల బెర్రీ పండ్ల గురించి మీరు వినే ఉంటారు. ఆయా పండ్లను చూసి కూడా ఉంటారు. కానీ మల్బెర్రీ పండ్లను మీరు ఎప్పుడైనా చూశారా..? ఈ పేరును చాలా మంది వినే ఉంటారు. కానీ ఈ పండ్లను చూసి ఉండరు. మనకు రహదారుల పక్కన లేదా స్టోర్స్‌లో మల్బెర్రీ పండ్లను బాక్సుల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ఇవి ఎంతో తియ్యగా ఉంటాయి. చూసేందుకు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మల్బెర్రీ పండ్లు సాధారణంగా తెలుపు, ఎరుపు, బ్లాక్ రంగుల్లో ఉంటాయి. అయితే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్‌బెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

రోగాలు రాకుండా రక్షణ..: రెస్వెరెట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ బెర్రీ పండ్లలో అధికంగానే ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇదే పోషక పదార్థం రెడ్ వైన్‌లోనూ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. గుండె కండరాలు వాపులకు గురి కాకుండా చూస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: మల్బెర్రీ పండ్లను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో 1-డిఆక్సీనోజిరిమైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్లను శరీరం త్వరగా గ్లూకోజ్‌గా మార్చకుండా చూస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ పెరగవు, నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. మల్బెర్రీ పండ్లలో జియాజంతిన్, లుటీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. కళ్లు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది.

క్యాన్సర్ రాకుండా..: మల్బెర్రీ పండ్లలో బయో యాక్టివ్ సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే ఆంథో సయనిన్స్, రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనాల్ల క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ కె, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగామార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లన తినడం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇలా మల్బెర్రీ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సెగగడ్డలు బాధిస్తున్నాయా..



ఈ కాలంలో శరీరంలో అధిక వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి.

సెగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది. రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్ళ, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు. తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.

కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?



టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన

కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.


దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం- సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి.సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి.దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

# ఈ అలవాటును తప్పించండి..

చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే



దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి.. వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.

వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.


పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.

వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.

# దేశానికి అవసరమైన మందు సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగుతాయి. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు,వాణిజ్య యుద్ధాలు, పొంచిఉన్న అంటువ్యాధు లు, తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షోభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి,సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.ఆయురారోగ్యాలతో వర్థిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏమేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది. కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలోఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం. మన దేశంలోనూ అలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు.

ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారు ల డెబ్భై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యా×ప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుధృడమైన కృషి చేపట్టాలి. ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి. కఠోర వాస్తవాలు: క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడిన×ఆర్థికంగా అందరికీ మెరుగైన×ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మౌలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు. అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాలి.




ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం. మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. గత డిసెంబర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి 2000 మంది జనాభాకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' నెలకొల్పుతామంటూ చేసిన ప్రకటన మూలంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం అవుతాయనే ఆశ చిగురించే అవకాశముంది. వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఈ ఆరోగ్య మందిరాలను నెలకొల్పారుగానీ సెకండరీ/ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలతో వీటిని పూర్తి స్థాయిలో అనుసంధానం చెయ్యలేదు. అలాగే 'రిఫరల్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నది.

ఇక ప్రభుత్వ ప్రాయోజిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ప్రధానమంత్రి జన ఆయుష్ యోజన' (పిఎం.జె.ఎ.వై) ఆసుపత్రిలో 'ఇన్-పేషెంట్' ఖర్చులకు పూచీ పడుతుంది కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల ఖర్చులను 'కవర్' చేయడం లేదు. ప్రభుత్వ ప్రాయోజిత ఇన్సూరెన్స్ పథకాలేవీ 'అవుట్ పేషెంట్' చికిత్సకయ్యే ఖర్చులను భరించడం లేదు. వాస్తవానికి 'అవుట్ పేషెంట్' వైద్యానికి అయ్యే ఖర్చులో 60 నుండి 70 శాతం ఖర్చులు పరీక్షలు చేయించుకోవడానికి, మందులు కొనడానికే అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అవసరమైన తక్షణ వైద్య సేవలు అందించడంతో పాటు మెరుగైన వైద్య సౌకర్యం అవసరమైన వారిని మాత్రమే సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల కు 'రిఫర్' చేసే పటిష్ట వ్యవస్థగా కూడా పనిచేయాలి. చాలా దేశాల్లో రిఫరల్ వ్యవస్థను అనివార్యం చేశారు. తద్వారా సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల మీద ఒత్తిడి తగ్గుతుంది.

ఆరోగ్య సేవల ప్రైవేటీకరణతో తలెత్తే సమస్యలు: మన దేశంలో ప్రైవేటు వైద్యరంగ విస్తృతి చాలా ఎక్కువ. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' వ్యవస్థగా క్రియాశీలంగా పని చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. ప్రభుత్వ రంగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆసుపత్రి లేదా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని స్పెషలిస్టు డాక్టర్ల నుండి టెలీ వైద్య సలహాలు, సేవలు పొందే వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

అయితే ప్రైవేటు కార్పొరేట్ వైద్యరంగ విస్తృతి మూలంగా, ప్రాథమిక ఆరోగ్య రంగ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం మూలంగా, వైద్య వృత్తిలో నిపుణులు, నిపుణులు కానివారు కూడా ఉండడం వల్లనా చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య రంగంలోకి కార్పొరేట్ ప్రైవేటు రంగం కాలుపెడితే 'రిఫరల్' వ్యవస్థ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చే సాధనంగా మారుతుంది.

కార్పొరేట్ ఆసుపత్రులు ప్రధానంగా నగరాలు, పెద్ద పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి అత్యంత ఆధునిక వైద్య సేవలు అందిస్తాయి. కానీ దానికి అయ్యే ఖర్చులు భారీగా ఉంటాయి.

ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ఎయిమ్స్' వైద్య సంస్థలను నెలకొల్పడం ద్వారా 'ప్రాంతీయ' వైద్య సేవలను ప్రభుత్వ రంగంలో ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ప్రైవేటు యాజమాన్య కాలేజీ ఆసుపత్రులు కూడా ఈ సేవలు అందించవచ్చు. అయితే సెకండరీ వైద్యసేవల రంగం ఇప్పటికీ బలహీనంగా ఉంది కాబట్టి తక్షణమే జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలి.అటు కేంద్ర ప్రభుత్వంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు గానీ జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించకపోగా ఇందులో వివిధ సేవలను అవుట్‌సోర్స్ చేయడం లేదా ప్రైవేటు రంగం మౌలిక సౌకర్యాల పెంపుదలకు పెట్టుబడులు పెడితే యాజమాన్య నిర్వహణను వాటికి అప్పచెప్పడం కొనసాగుతుంది. దీనిమూలంగా సార్వజనీన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యం, దీనితో అనుసంధానించి అందించాల్సిన సెకండరీ, ప్రాంతీయ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి.

జిల్లా ఆసుపత్రుల్లో రేడియాలజీ, లేబొరేటరీ సేవలు అందించడానికి తగిన యంత్రాంగం, సాంకేతిక సిబ్బంది కొరత వల్ల వీటిని ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ప్రైవేటు రంగానికి అప్పచెప్పారు. అలాగే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వైద్య కళాశాలల స్థాపనకు అనువుగా జిల్లా ఆసుపత్రులను ఆయా కాలేజీలకు అప్పజెప్పాలనే ఆలోచనలో ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకపోవడం మూలంగా ఈ దుస్థితి నెలకొన్నది. ప్రజారంగ ఆరోగ్య సేవలను ఏకీకృతం చెయ్యడం పట్ల విముఖత, ప్రైవేటు రంగం పట్ల ఉన్న మోజు మూలంగా

ఈ ధోరణులు తలెత్తుతున్నాయి. ఇక్కడ మన గమనంలో ఉండాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే ప్రైవేటు వైద్య రంగం ప్రధాన లక్ష్యం లాభార్జన మాత్రమే. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రైవేటు వైద్య రంగం అసలు రంగు బయట పడింది. కోవిడ్ వ్యాక్సిన్లలో కూడా ఈ రంగం వాటా కేవలం 2 శాతమే. ప్రభుత్వమే వ్యాక్సిన్లు సరఫరా చేసినా ప్రజలకు సేవలు అందించడంలో మాత్రం ప్రైవేటు రంగం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

క్షేత్ర స్థాయి వాస్తవాలు ఇవీ. ప్రభుత్వ రంగ వైద్య సేవలు అందుబాటు నానాటికీ క్షీణిస్తుంటే ప్రైవేటురంగం విపరీతంగా ఆదాయాలు పోగేసుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణను అల్లోపతి, ఆయుర్వేద వైద్యాల జమిలి తరహాలో ఏకీకృతం చెయ్యాలని యోచిస్తుంది.ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగం జిల్లా ఆసుపత్రుల నిర్వహణను ఏమేరకు చేపడుతుందనేది సందేహమే. జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసి వాటికి అనుబంధంగా నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించడమే సరైన పరిష్కారం అవుతుంది.జిల్లా ఆసుపత్రులను, వైద్య విద్యను ప్రైవేటీకరించడం మూలంగా సార్వజనీన ఆరోగ్య సేవలను అందజేయాలన్న లక్ష్యం దెబ్బతినిపోతుంది. మిశ్రమ ఆరోగ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రైవేటురంగ సేవలను కూడా యాథాశక్తి వినియోగించుకోవాలి గానీ సార్వజనీన ఆరోగ్య సంరక్షణ పట్ల తనకున్న బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడదు. చివరిగా, మనం జపాన్ ను కూడా వెనక్కినెట్టి ప్రపంచంలోనే నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని చెప్పుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యకర భారతదేశం అన్న ఆకాంక్షను సాకారం చేసుకోవాలే తప్ప ఆ బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడదు. ప్రభుత్వం మనసుపెట్టి చిత్తశుద్ధితో వ్యవహరిస్తే మన ఆరోగ్య వ్యవస్థను చూసి కెనడా కూడా అసూయపడేలా చూడవచ్చు. గుండె వైద్య నిపుణుడిగా నేను చెప్పే మాటలు అక్షర సత్యాలు.

# ఒక్కొక్కరికి లక్ష డాలర్లు..!

## గ్రీన్‌లాండ్ ప్రజలకు ట్రంప్ పెద్ద ఎత్తున ప్రలోభాలు డబ్బు ఎరవేసి దీవిని సొంతం చేసుకునేందుకు ప్రణాళిక



వాషింగ్టన్:గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా గుంజుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. డెన్మార్క్ నుంచి విడిపోయి, అమెరికాతో కలవాలని ఈ దీవి ప్రజలను ఒప్పించాలని యోచిస్తున్నారు.దీనిలో భాగంగా ఇక్కడ నివసిస్తున్న సుమారు 57,000 మందికి భారీగా డబ్బును ఎరగా వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

ఒక్కొక్కరికి10,000 డాలర్లనుంచి 1,00,000 డాలర్ల వరకు (సుమారు రూ.8 లక్షల నుంచి రూ.89 లక్షలు) ఇవ్వజూపేందుకు అధికారులు చర్చించినట్లు తెలిపింది. తూటా తర్వాతే మాట..: ఇదిలావుండగా, ఆర్కిటిక్‌లోని డానిష్ ప్రాంతంపై దాడికి పాల్పడేవారిపై తమ సైనికులు తక్షణమే కాల్పులు జరుపుతారని, ఆ తర్వాత ప్రశ్నలు అడుగుతారని డెన్మార్క్ గురువారం హెచ్చరించింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవలసిన అవసరం ఉందని ట్రంప్ పునరుద్ఘాటించిన తర్వాత గ్రీన్‌లాండ్ ప్రధానమంత్రి జెన్స్-ఫ్రెడరిక్ నీల్సన్ ఫేస్‌బుక్‌లో స్పందిస్తూ.. "ఇక చాలు.. కలుపుకోవడం గురించి ఇక ఫాంటసీలు వద్దు" అని ట్రంప్‌నకు హితవు పలికారు.

గ్రీన్‌లాండ్‌పై మోజు ఎందుకు?: అనేక కారణాల వల్ల గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవలసిన అవసరం ఉందని ట్రంప్ చాలా కాలం నుంచి చెప్తున్నారు. ఇక్కడ అడ్వాన్స్‌డ్ మిలిటరీ అప్లికేషన్స్ కోసం అవసరమైన ఖనిజాలు పుష్కలంగా ఉండటం ఒక కారణమని తెలిపారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడంపై ట్రంప్ సహాయకుల మధ్య చర్చలు ఆయన రెండోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టడానికి ముందే ప్రారంభమయ్యాయి. ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అరెస్ట్ చేసిన తర్వాత గ్రీన్‌లాండ్ స్వాధీనం మరింత అత్యవసరంగా మారిందని వైట్ హౌస్ వర్గాలను ఉటంకిస్తూ అమెరికన్ వార్తా సంస్థ తెలిపింది.

ఒక్కొక్కరికీ 1 లక్ష డాలర్లు చెల్లిస్తే, మొత్తం 6 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని, ఇది ఆచరణ సాధ్యమేనని వీరు చెప్తున్నారు.

అమెరికాతో కలవం..: గ్రీన్‌లాండర్స్‌లో అత్యధికులు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నట్లు పోల్స్ చెప్తున్నాయి. డెన్మార్క్ నుంచి విడిపోతే ఆర్థిక వ్యయాలతోపాటు అనేక సమస్యలు ఉంటాయని గ్రీన్‌లాండ్ లెజిస్లేటర్లు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఇండిపెండెన్స్ రిఫరెండం కోసం పిలుపు ఇవ్వడం లేదు. మరోవైపు డెన్మార్క్ నుంచి విడిపోవడానికి గ్రీన్‌లాండర్స్ ఇష్టపడుతున్నప్పటికీ, అమెరికాతో కలవడానికి మాత్రం నిరాకరిస్తున్నారు.

# 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యం




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ), ఇమేజ్ 2.0 వంటి నూతన విధానాలను అమలు చేస్తోంది. 2025-26 నాటికి రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు, 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి, హైదరాబా ద్‌ను జీసీసీ హబ్‌గా మార్చనున్నారు. యానిమేషన్, గేమింగ్ రంగాల కోసం ఇమేజ్ 2.0 విధానాన్ని తెస్తూ.. సృజనాత్మక రంగంలో యువతకు ఉపాధి పెంచనున్నారు తెలంగాణను ప్రపంచ ఐటీ రంగంలో అగ్రస్థాన ంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) పాలసీ, ఇమేజ్ 2.0 విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ఐటీ ఎగుమతులను రూ.3.60 లక్షల కోట్లకు చేర్చడమే కాకుండా.. దాదాపు 11 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ స్థాయి కంపెనీల సీఈఓలతో సమావేశమై హైదరాబాద్‌ను ప్రధాన ఐటీ హబ్‌గా ప్రదర్శించనున్నారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ,డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో పనిచేసే గ్లోబల్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.వినోద, సాంకేతిక రంగాల కలయికతో 'ఇమేజ్ 2.0' పాలసీని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ రంగమే కాకుండా యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్ (ఎఈసీ) విభాగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తుంది. దీనివల్ల కళాత్మక నైపుణ్యం ఉన్న యువతకు హై-స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయి. మెటావర్స్, డిజిటల్ కంటెంట్ తయారీలో మరిన్ని స్టార్టప్‌లు వచ్చేలా రాయితీలు కల్పించను న్నారు. కొత్త విధానాలను సమర్థవం తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పరిశ్రమల నుంచి నేరుగా నిపుణులను కన్సల్టెంట్లుగా నియమిం చుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న నైపుణ్య లోటును భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అం తర్జాతీయ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి.. పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా ఆమోదించడానికి ఈ నిపుణుల బృందం పని చేస్తుంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ కేవలం సేవల రంగంలోనే కాకుండా.. పరిశోధన మరియు అభివృద్ధి ) విభాగాల్లోనూ అగ్రగామిగా నిలవనుంది. మిషన్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతోపాటు.. అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఈ సరికొత్త ఐటీ పాలసీలు కీలకం కానున్నాయి.


# మహిళల సేఫ్టీలో తెలంగాణ ఫోర్త్ ప్లేస్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** దేశంలోనే మహిళలకు బెస్ట్ సిటీగా బెంగళూరు రికార్డు సృష్టించింది. టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా 2025 నివేదిక ప్రకారం..మహిళా సాధికారత,ఉద్యోగ అవకాశాల్లో బెంగళూరు దేశంలోనే నంబర్ 1 నగరంగా నిలిచింది. భద్రతలో మొదటి స్థానంలో చెన్నై ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం మీద దక్షిణ, పశ్చిమ భారతదేశ నగరాలు మహిళలకు అత్యంత సురక్షితమైన, వృద్ధిని ఇచ్చే ప్రాంతాలుగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన అవతార్ గ్రూప్ అనే ప్రముఖ వర్క్‌ప్లేస్ ఇంక్లూజ న్ సంస్థ 2025 ఏడాదికి గానూ దేశంలోని వివిధ నగరాలపై.. పలు అంశాలపై అధ్యయనం నిర్వహించింది. ఈ తాజా అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2025లో భారతదేశంలో మహిళలు నివసించడానికి, పనిచేయడానికి అత్యంత అనుకూలమైన నగరంగా కర్ణాటక రాజధాని బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ రిపోర్ట్‌లో మొత్తం దేశంలోని 125 నగరాలను విశ్లేషించి.. సిటీ ఇం క్లూజన్ స్కోర్ (సీఐఎస్) ఆధారంగా ఆయా నగరాలకు అవతార్ గ్రూప్ ర్యాంకులను కేటాయించారు.మొత్తం స్కోరులో 53.29 పాయింట్లతో మొదటి స్థానంలో బెంగళూరు నిలిచింది. ఆ తర్వాత 49.86 పాయింట్లతో చెన్నై రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ -5లో ఉన్న పుణె (46.27).. హైదరాబాద్ (46.04).. ముంబై (44.49) వరుసగా నిలిచాయి.

ప్రధా నంగా రెండు అంశాల మీద ఆధారపడి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఒకటి సామాజిక భద్రత, జీవన ప్రమాణాలను కొలిచే సోషల్ ఇంక్లూజన్ స్కోర్.. రెండోది ఉద్యోగ అవకాశాలు, పని వాతావరణాన్ని కొలిచే ఇండస్ట్రియల్ ఇంక్లూజన్ స్కోర్.మహిళల భద్రత, ప్రభుత్వ సేవలు, విద్య, ఆరోగ్య సదుపాయాల విషయంలో చెన్నై నగరం దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే.. బలమైన కార్పొరేట్ వ్యవస్థ, స్టార్టప్‌లు, విస్తృతమైన ఉద్యోగ అవకాశాల కారణంగా బెంగళూరు పారిశ్రామిక విభాగంలో అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్‌గా నంబర్ 1 నగరంగా మారింది. హైదరాబాద్, పుణె నగరాలు అటు సామాజిక భద్రతలోనూ..

ఇటు ఉద్యోగ అవకాశాలలోనూ సరైన సమతుల్యతను కలిగి ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

# పురుషుల కంటే ఉద్యోగ అవకాశాలు భారీగా కోల్పోనున్న భారత మహిళలు




హెచ్ -1 బీవీసా లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడనుంది. మిగతా దేశాల మాట అటుంచితే.. ముఖ్యంగా భారత్ యువత ఉపాధిపై కోలుకోలేని దెబ్బ పడింది. మరీ ముఖ్యంగా మహిళల పరిస్థితి అగమ్యగోచరమైంది. మగవారికంటే ఎక్కువ చదువుకున్నా.. ఉద్యోగాల విషయంలో కంపెనీలు మగవారికే మొగ్గు చూపుతున్నాయి. దీంతో అమెరికాలో మహిళల ఉపాధి అవకాశాలు బాగా తగ్గే అవకాశం ఉందని పలు సర్వేలు వెల్లడించాయి.

ఉదాహరణకు హెచ్-1బి వీసా ద్వారా గతేడాది అమెరికు వెళ్లిన కార్మికుల్లో ఉద్యోగాలు కొనసాగించడానికి అవకాశం ఉన్న కార్మికుల్లో 74శాతం మంది పురుషులు ఉంటే.. 26 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. ఇక జీతాల విషయానికొస్తే.. స్త్రీ-పురుష జీతాల్లో చాలా వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు 2024 సంవత్సరం ప్రకారం చూస్తే.. ప్రారంభంలో కొద్దినెలల ఉద్యోగానికి (బోటమ్ క్వార్టర్ 25 శాతం)) మహిళల జీతం 77వేల డాలర్లు. అదే పురుషులకైతే 1,02,000 డాలర్లు. ఇక మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలకు 97వేల డాలర్లు, పురుషులకు 1,32,000 డాలర్లు. టాప్ క్వార్టర్ (75 శాతం) మహిళలకు 1,30,000 డాలర్లు, పురుషులకు 1,69,000 డాలర్లు సంపాదిస్తున్నారు. చదువు అయిపోగానే ఉద్యోగం చేసే మహిళలు, పురుషుల జీతాల్లో కూడాజీతాల వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది.

బోటమ్ క్వార్టర్ (25 శాతం) 71,000, పురుషులకు 80,000 డాలర్లు. మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలు 91,000 డాలర్లు, పురుషులు 99,000 డాలర్లు. ఇక టాప్ క్వార్టర్ అయితే మహిళలకు 1,25,000 డాలర్లు. పురుషులకు 1,31,000 డాలర్లు సంపాదిస్తున్నారు. పురుషుల కంటే.. మహిళలు చాలా తక్కువ జీతంతోనే పనిచేస్తున్నారు.

అమెరికాకు వెళ్లి ఉద్యోగం చేయాలని పురుషుల కంటే..

మహిళలే ఎక్కువ శాతం ఉంది ఉన్నారు. 35ఏళ్లలోపు మహిళలు 75శాతం మ ంది ఉంటే పురుషులు 65 శాతం మందే ఉద్యోగానికి మొ గ్గుచూపడం గమనార్హం.

## తిరుమల దర్శనాల పేరుతో మోసాలు..?

# భక్తులకు టీటీడీ కీలక హెచ్చరిక!

**తిరుమల దర్శనాలు ఇప్పిస్తామని సోషల్ మీడియాలో మోసాలు**
**భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్**
**అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని భక్తులకు టీటీడీ సూచన**
**మోసగాళ్ల సమాచారం కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ జారీ**
**తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా**



**తిరుమల,తెలంగాణ దిశ:** తిరుమల శ్రీవారి దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు సాగిస్తున్న మోసాలపై టీటీడీ ఉక్కుపాదం మోపింది. భక్తులను మాయమాటలతో నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. ఈక్రమంలోనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టీటీడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సోషల్ మీడియాలో "శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం" అనే ఐడీతో భక్తులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ విభాగం, పోలీసుల సమన్వయంతో అదుపులోకి తీసుకుంది. నిందితులను చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులుగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తులను, దళారు లను నమ్మి మోసపోవద్దని సూచించింది. ఎవరైనా దర్శనాలు, గదులు ఇప్పిస్తామని సంప్రదిస్తే, వెంటనే టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 9866898630కు సమాచారం ఇవ్వాలని కోరింది.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఢిల్లీ సీఎం: ఢిల్లీ సీఎం రేఖా గుప్తా స్వామివారి దర్శనం అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సెంటర్ పనితీరును ఆమెకు వివరించారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి, క్యూలైన్లను సమర్థవంతంగా నిర్వహించడానికి ఉపయోగిస్తున్న "ప్రెడిక్టివ్ అనలిటిక్స్" టెక్నాలజీ గురించి తెలిపారు. లడ్డూ ప్రసాదం తయారీ, రవాణా, ట్రాఫిక్ నిర్వహ ణ, వసతి గదుల కేటాయింపు వంటి అన్ని విభాగాలను ఈ సెంటర్ ద్వారా ఎలా సమన్వయం చేస్తున్నారో వివరించారు. భక్తుల భద్రత, సౌకర్యాల కోసం టీటీడీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న తీరును ఢిల్లీ సీఎం రేఖా గుప్తా అభినందించారు.

## ఇంధన ధరలు తగ్గాలంటే కార్లు తక్కువగా వాడండి

# అమెరికన్లకు షెవ్రాన్ అధికారి సలహా

**- డబ్బు ఆదా చేసుకోవాలంటే ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలని వ్యాఖ్య**
**- హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలు**
**- జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్**
**- ఈ నెల 22తో ముగియనున్న అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం**



ఢిల్లీ,:అమెరికా-ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో గ్యాస్ ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రముఖ చమురు సంస్థ షెవ్రాన్ ఎగ్జిక్యూటివ్ ఆండీ వాల్జ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పెరిగిన ధరల నుంచి ఉపశమనం పొందాలంటే ప్రజలు తమ వాహనాలను తక్కువగా వాడాలని, ఇంధనాన్ని పొదుపు చేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. సీబీఎస్ న్యూస్‌తో మాట్లాడుతూ... "ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలి. ఇంధనాన్ని పొదుపు చేసేందుకు ప్రయత్నించాలి. నిజానికి మనం ఎప్పుడూ ఇలాగే చేయాలి. ఇంధనం ప్రజల జీవితాలకు అత్యవసరం. దానిని మనం పొదుపుగా వాడుకోవాలి" అని వాల్జ్ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ సముద్ర మార్గ చమురు, సహజవాయువు రవాణాలో దాదాపు 20 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని తన అధీనంలోకి తీసుకోవడంతో గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురుపై ఆధారపడిన అనేక దేశాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. దీని ప్రభావంతో అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ అంశంపై వాల్జ్ వివరిస్తూ... "ఇది అంతర్జాతీయ మార్కెట్ సమస్య. కేవలం అమెరికన్ల కోసం ధరలను తగ్గించడానికి తక్షణమే అద్భుత పరిష్కారాలేవీ లేవు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత కఠినంగా ఉంటుంది" అని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలమవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్ జలసంధిపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. "ప్రపంచంలోనే అత్యుత్తమమైన మా నౌకాదళం, హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే లేదా బయటకు వెళ్లే అన్ని నౌకలను తక్షణమే దిగ్బంధిస్తుంది" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ వైఖరి మారే వరకు ఈ దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 22తో ముగియనుంది.

# దువ్వాడ స్థానంలో వాణికే అవకాశం

**విజయనగరం,తెలంగాణ దిశ:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేసింది. వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీ ఆయనను దూరం పెట్టింది. అయితే ఆయన తిరిగి వైసీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి వర్కౌట్ అయ్యేలా లేవు. ధర్మాన సోదరులతో పాటు దాదాపు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులంతా దువ్వాడ శ్రీనివాసుని వ్యతిరేకిస్తున్నారు. సామాజిక వర్గ కోణంలో చూపి తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేశారు దువ్వాడ. కానీ ఆ ప్రయత్నలేవి వర్కౌట్ కాలేదు. దీనికి తోడు దువ్వాడ శ్రీనివాస్ వాణి ఇప్పుడు వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా దువ్వాడ శ్రీనివాస్ దూకుడుకు ఆమె బ్రేక్ వేసినట్టు కనిపిస్తున్నారు. జిల్లా పార్టీ పెద్దల ప్రోత్సాహంతోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన దువ్వాడ శ్రీనివాస్ వైసీపీ పెద్దలపై రగిలిపోతున్నట్లు సమాచారం.దువ్వాడ వాణి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఒక విధంగా వాణి కుటుంబం వల్లే దువ్వాడ శ్రీనివాస్ కు ఆ పేరు వచ్చింది. టెక్కలి ఎంపీపీ తో పాటు జడ్పిటిసి గా కూడా ఉన్నారు వాణి. మొన్నటి ఎన్నికల్లో ఆమెకు ముందుగా టికెట్ ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరి నిమిషంలో దువ్వాడ శ్రీనివాస్ కు ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం దువ్వాడ కుటుంబంలో రేగిన వివాదం గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లోనే వాణి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. అయితే ఆ నిర్ణయం ఆలస్యంగా తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేశారు. అయితే తిరిగి పార్టీలోకి దువ్వాడ చేరుతానని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ధర్మాన సోదరులపై మాత్రం అనుచిత వ్యాఖ్యలు తగ్గించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ కు చెక్ చెప్పేందుకు దువ్వాడ వాణి రంగంలోకి దిగారు.దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన క్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు వాణికి అప్పగిస్తారని అంత ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా పేరాడ తిలక్ కు ఇచ్చారు. అయినా సరే దువ్వాడ వాణి జిల్లా వైసీపీ పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు. అయితే టెక్కలిలో కింజరాపు అచ్చెనాయుడుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారని.. దిష్టిబొమ్మను దహనం చేశారని పోలీసులు పేరాడ తిలక్ ను అరెస్టు చేశారు. ఆ సమయంలో వైసీపీ నేతలు టెక్కలిలో ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదుట వాణి బైఠాయించారు కూడా. టెక్కలి వైసీపీలో మరోసారి దువ్వాడ శ్రీనివాస్ కు ఛాన్స్ ఇవ్వకూడదని.. ఆయనను తిరిగి పార్టీలో చేర్చకూడదని.. టెక్కలిలో తిలక్ ను గెలిపిస్తే నామినేటెడ్ పోస్టు వాణికి ఇస్తామన్న ఆఫర్ తోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఆమె సైతం దువ్వాడ శ్రీనివాసును పొలిటికల్ గా క్లోజ్ చేయాలని గట్టి సంకల్పంతో ఉన్నట్లు సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

### బాధితులను పరామర్శించిన కలెక్టర్ సిరి

కర్నూలు: కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. బొలెరో వాహనం డ్రైవరు నిద్ర మత్తులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు.




## ఇరాన్‌తో చర్చలకు

# అమెరికా కొత్త మెలిక

వాషింగ్టన్: అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా-ఇరాన్ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించాలంటే రెండు కఠినమైన షరతులను పాటించాల్సిందేనని అమెరికా స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో జరగబోయే తదుపరి విడత చర్చలకు ముందే ఈ నిబంధనలను తెరపైకి తెచ్చింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు రెండు రోజుల్లో పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచనప్రాయంగా తెలిపినప్పటికీ, ఈ కొత్త షరతులు సందిగ్ధతకు దారితీస్తున్నాయి. దౌత్యపరమైన వర్గాలను ఉటంకిస్తూ ఇజ్రాయెల్ హయోమ్ పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం అమెరికా పెట్టిన మొదటి షరతు.. హర్మూజ్ జలసంధిని ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా తెరవడం. ఇరాన్ గనుక తమ నౌకలు, ట్యాంకర్ల రాకపోకలను అడ్డుకుంటే, తాము కూడా ఇరాన్ నౌకలను కదలనివ్వబోమని అమెరికా స్పష్టం చేసింది. ప్రతిచర్య తప్పదనే సంకేతాలను బలంగా పంపింది.

ఇక రెండో షరతుగా.. చర్చలకు వచ్చే ఇరాన్ ప్రతినిధి బృందానికి ఒప్పందాలను ఖరారు చేసే పూర్తి అధికారం ఉండాలని అమెరికా పట్టుబడుతోంది. ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సహా ప్రభుత్వంలోని అన్ని కీలక విభాగాల ఆమోదం పొందే అధికారం ఆ బృందానికి ఉండాలని స్పష్టం చేసింది. ఇస్లామాబాద్‌లో కుదిరే ఏ ఒప్పందానికైనా ప్రభుత్వంలోని ఉన్నతాధికారులందరి సమ్మతి ఉండాలని కోరుకుంటోంది.

ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు: అమెరికా ఈ షరతులు పెట్టడం వెనుక బలమైన కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వంలో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వంటి రాజకీయ నాయకత్వానికి, ఐఆర్‌జీసీకి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరినట్లు కథనాలు వస్తున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన చర్చల్లో అమెరికాకు సమాధానాలు ఇవ్వకుండా రాజకీయ ప్రతినిధి బృందాన్ని ఐఆర్‌జీసీకి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు అడ్డుకున్నారని సమాచారం. ఈ అంతర్గత గందరగోళం కారణంగానే ఒప్పందం చేసుకునే పూర్తి అధికారంతో వస్తేనే చర్చలుంటాయని అమెరికా స్పష్టం చేసింది. గత వారాంతంలో పాకిస్థాన్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన తొలి విడత చర్చలు ఎలాంటి పురోగతి లేకుండానే ముగిశాయి. దశాబ్దం తర్వాత అమెరికా, ఇరాన్ అధికారులు నేరుగా చర్చలు జరపడం ఇదే తొలిసారి.



**53వేల కోట్ల బకాయిలు రాబట్టడంలో గుర్తింపు సంఘాలు విఫలం**
**ఏఐటీయూసీ, ఐఎన్టీయుసి సంఘాల స్వార్థ విధానాలతో పరిష్కారానికి నోచుకోని పెండింగ్ సమస్యలు**
**12వ వేతన ఒప్పందం అమలుకై దశల వారి ఆందోళనలకు సిద్ధం కావాలి**
**ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్**

## రాజకీయ కారణాలవల్లే ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన

# "సింగరేణి"



**కొత్తగూడెం,తెలంగాణ దిశ:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని బిఎంఎస్ అనుబంధ ఏబికేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ ఆరోపించారు. స్థానిక బిఎంఎస్ భవన్ లో యూనియన్ ఉపాధ్యక్షులు బి. రాంసింగ్ అధ్యక్షతన జరిగిన సింగరేణి కోల్ మెన్స్ కార్మిక సంఘ్ కార్పొరేట్ ఏరియా, కొత్తగూడెం ఏరియాలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధిక రాజకీయ జోక్యంతో సంస్థను ఆర్థికంగా బలహీనపరుస్తున్నాయని విమర్శించారు. డిసెంబర్ 2025 నాటికే సింగరేణికి రావలసిన సుమారు రూ.50,000 కోట్ల బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుండి వసూలు చేయడంలో గుర్తింపు సంఘాలు అయిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ విఫలమయ్యాయని విమర్శించారు. దీనివల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందు లు మరింత తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.గత రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా కొనసాగిన ఏఐటీయూసీ తమ కాలంలో స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించినప్ప టికీ, కార్మిక సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంతేగాక కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘంగా కాలపరిమితి ముగిసిన తర్వాత ఆందోళనలు చేపట్టడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఏ ఐ టి యుసి,ఐ ఎన్ టి యు సి సంఘాల నాయకులు ప్రకటించిన కార్మిక వర్గానికి సొంతింటి పథకం, పెర్క్‌పై ఇన్‌కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, చీఫ్ ఫార్మసిస్ట్, చీఫ్ రేడియాలజీ, చీఫ్ ల్యాబ్ టెక్నీషియన్ వంటి క్యాడర్ స్కీమ్‌ల అమలులో విఫలమయ్యారని విమర్శించారు. నర్సులకు ఆఫీసర్ గ్రేడ్ ఇప్పిస్తామని ప్రకటించి, ఆచరణలో ఎందుకు అమలు చేయకపోయారంటు ప్రశ్నించారు. మారుపేర్ల సమస్యతో వేలాది మంది కార్మికులు రోడ్లపై ఆందోళనలు చేస్తున్నప్పటికీ, వాటి పరిష్కారంలో కూడా వైఫల్యం చెందినట్లు స్పష్టమైందన్నారని వ్యాఖ్యానించారు. అదేవిధంగా కొత్త గనుల కేటాయింపులో రాజకీయ కారణాలతో సింగరేణికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో గనులు రాకుండా అడ్డుకున్న కార్మిక సంఘాలే ఇప్పుడు వేలం ద్వారా గనులు పొందాలని చెప్పడం దూరంగా ఉందని ఆరోపించారు. ఈ పరిస్థితులకు సంబంధిత సంఘాలు బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.భారతీయ మజ్దూర్ సంఘ్ ( బి ఎం ఎస్) రాజకీయాలకు అతీతంగా సింగరేణి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని మరోసారి స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకుల వేలం ద్వారా కొత్త గనులు సాధించి సంస్థ మనుగడ కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న బిఎంఎస్‌ను కార్మికులు ఆదరించి ప్రత్యేక సంఘంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన సవరణ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ ఏడాది జూలై 1వ తేదీ నుండి అమలులోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని బిఎంఎస్ నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాక కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి వెంటనే జేబీసీసీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబికేఎంఎస్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. 12వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఆందోళనల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్, యూనియన్ నాయకులు ఎం. శ్రీనివాస్, కాసర్ల మోహన్, ఉదయ్, భీమా, బాలకృష్ణ, అశోక్, ఠాగూర్, నరేష్, చంద్రశేఖర్, రవి, వడ్డీ కాసులు, శైలేందర్, వీర కుమార్, రాజేష్, ఆత్రేయ, సుధాకర్, సంగం చందర్, ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల తదితరులు, కొత్తగూడెం కార్పొరేట్ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేతనాలు పెంచమంటే...!



రెక్కలు ముక్కలు చేసుకున్నా కనీస అవసరాలు కూడా తీరకపోవడంతో వేతనాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు విరుచుకుపడుతున్న తీరు దుర్మార్గం! నెలల తరబడి విజ్ఞప్తులు చేసినా, రాయబారాలు జరిపినా కనీస స్పందన లేకపోవడంతో కార్మికులకు ఆందోళనలకు దిగడం మినహా మరోమార్గం లేకుండా పోయింది. సోమవారం నాడు తొలుత రెండు మూడు యూనిట్ల వద్ద శాంతియుతంగా కార్మికుల ఆందోళన ప్రారంభమైంది. ఆ తరువాత ఒకటి, రెండు గంటల్లోనే 80కిపైగా ప్రదేశాలకు విస్తరించడం, 45 వేల మందికిపైగా భాగస్వాములు కావడం పారిశ్రామిక వాడల్లో పరిస్థితులు ఏ స్థాయికి దిగజారాయో, కార్మికులు ఎంతగా విసిగి పోయి ఉన్నారో చెప్పడానికి నిదర్శనం. శాంతియుతంగా సమస్యను పరిష్కరించాల్సిన బిజెపి ప్రభుత్వాలు దానికి భిన్నంగా వ్యవహరించి, భయభ్రాంతులను చేయడమే లక్ష్యంగా పోలీసులను ఉసిగొల్పాయి. అయినా, వెనక్కి తగ్గని కార్మికులు వేతనాల పెంపుతో పాటు, పని ప్రదేశంలో భద్రత, ముందస్తు నోటీసు లేకుండా తొలగింపు, పనిగంటల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మరింత ఉధృతంగా తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అణచివేత చర్యలకు దిగింది. 300 మందికి పైగా కార్మికుల ను, నేతలను అరెస్ట్ చేసింది. కార్మిక వాడలతో పాటు, సమీపంలోని గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున దాడులకు దిగింది. కార్మికులను కొట్టడంతో పాటు, కనపడిన వారికి కనపడ్డట్టుగా ఎత్తుకుపోతున్నారంటూ వస్తున్న వార్తలు భయం కలిగిస్తున్నాయి. వారిని ఎక్కడకు తరలిస్తున్నారో కూడా చెప్పడం లేదంటూ కార్మిక కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. కార్మికులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని సైతం పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడానికి బాధ్యత వహించాల్సిన కార్మికశాఖ మంత్రి విదేశీ శక్తుల మద్దతుతో ఆందోళనలు జరుగుతున్నాయనడం, కార్మికులను ఉగ్రవాదులతో పోల్చడం సిగ్గుచేటు!

దేశ రాజధాని న్యూఢిల్లీకి అత్యంత సమీపంగా ఉండే నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగావ్‌లలోని నేషనల్ కాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)పారిశ్రామిక బెల్ట్ లోని వివిధ ఫ్యాక్టరీల కార్మికులు చట్టబద్ధ హక్కులు, కనీస జీవన ప్రమాణాల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో కనీస వేతనం అన్న భావన రద్దు అయ్యింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఫ్యాక్టరీల యజమానులు పెద్ద ఎత్తున శ్రమ దోపిడి ప్రారంభించారు. ఎన్‌సిఆర్ విస్తరించి ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానాల్లోని బిజెపి ప్రభుత్వాలు యాజమాన్యాల ప్రయోజనాలకే పెద్దపీట వేయడంతో కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. రోజుకి పది గంటలపైగా పని చేసినా 300 రూపాయల వేతనం లభించడం కూడా కష్టంగా మారింది. దీంతో పాటు లేబర్ కోడ్‌ల పుణ్యమా అని కాంట్రాక్టు వ్యవస్థ కార్మికుల పని భద్రతను ప్రశ్నార్ధకంగా మార్చింది. ఎప్పుడు ఉంటుందో, ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో పనికోసం, వేతనాల కోసం యాజమాన్యాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి కార్మికులకు ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకున్న యాజమాన్యాలు పని ప్రదేశాల్లో భద్రతా చర్యలను దాదాపుగా విస్మరించాయి. పెద్ద ఎత్తున అమానవీయ చర్యలకు, శ్రమ దోపిడికి దిగాయి.

అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం సాగదు కదా! వేతనాలు పెంచాలని, చట్టబద్ధమైన ప్రయోజనాలు అమలు చేయాలని కార్మికులు కొంత కాలంగా ఆందోళనకు దిగారు. గత రెండున్నర మాసాలుగా ఈ నిరసనలు సాగుతున్నాయి. అప్పటి నుండి ఈ ఆందోళనలను అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. అప్పటి నుండి అరెస్ట్‌లు జరుగుతూనే ఉన్నాయి.

ఢిల్లీలోని సిఐటియు నేతలను కొద్ది రోజులగా గృహ నిర్బంధంలో ఉంచారు. అయినా, ఎన్‌సిఆర్‌లో కార్మికుల తిరుగుబాటును ఆపలేకపోయారు. ఇప్పటికైనా పరిస్థితి తీవ్రతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్ధం చేసుకోవాలి. అన్ని రకాల అణచివేత, ప్రతీకార చర్యలను తక్షణమే ఆపివేయాలి. కార్మికులతోనూ, కార్మిక సంఘాలతోనూ చర్చించి వారి డిమాండ్లను పరిష్కరించాలి.

## పదవ రోజుకు చేరిన ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్ ల నిరసన




మందమర్రి టౌన్: సింగరేణి ప్రైవేట్ సెక్యూ రిటీ గార్డుల పోరాటం 10వ రోజుకు చేరగా కాసి పేట గనిపై ప్ల కార్డులు పట్టుకొని శాంతియుతంగా నిరసనను తెలియ జేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీని వాస్ మాట్లాడుతూ ప్రైవే టు సెక్యూరిటీ గార్డుల పోరాటం ఎస్సీకేఎస్ సిఐ టియు ఆధ్వర్యంలో 10వ రోజు కాసిపేట బాయ్ మీద నిరసన తెలియజే యడం జరిగిందని అన్నా రు. దీనికి టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ అశోక్, ఏ ఐటి యుసిఫిట్ సెక్రెటరీనాగ మల్లేష్ మద్దతు తెలిపారు. గత రెండు నెలలుగా ఉపాధి కోల్పో యి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ల విషయంలో మానవత దృక్పథంతో ఆలోచించి సమస్యను పరిష్కరించే లా ఏరియా జియం చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి స్పందించి ప్రైవేటుసెక్యూరిటీగార్డుల సమస్య ను ప్రత్యేక చొరవ తీసుకొని జియంతో చర్చించి న్యాయం జరిగే విధంగా ఏలాంటి ఆంక్షలు లేకుండా విధు ల్లోకి తీసుకునేలా చూడా లని తెలిపారు. లేని పక్షంలో తర్వాత జరగబోయేపరిణామాలకు అధికా రులు మంత్రివర్యు లే పూర్తి బాధ్యత వహించ వలసి వస్తుందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళలతో పాటు మగవాళ్లకూ తప్పని వేధింపులు..

# టీసీఎస్ లో దారుణాలు




- మతం మార్చుకోవాలని ఒత్తిడి.. వినకుంటే పనిభారం
- పిల్లలు కలగని ఓ యువ ఉద్యోగితో అసభ్యకరమైన మాటలు
- మీడియా ముందు వెల్లడించిన బాధితుడు

ఢిల్లీ,: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, మతమార్పిడి ప్రయత్నాలకు సంబంధించిన వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు తమ అధికారాన్ని ఉపయోగించుకుని మహిళా ఉద్యోగులను మాత్రమే కాదు, పురుష ఉద్యోగులను కూడా మానసికంగా హింసించారని, బలవంతపు మత మార్పిడులకు ఒత్తిడి చేశారని బయటపడింది. తాజాగా ఒక పురుష ఉద్యోగి తనకు ఎదురైన భయంకరమైన అనుభవాలను బయటపెట్టారు. తనతో బలవంతంగా 'స్కల్ క్యాప్' (టోపీ) ధరింపజేసి, నమాజ్ చేయించారని ఆయన ఆరోపించారు. అంతటితో ఆగకుండా, నిందితుల్లో ఒకరు తన వ్యక్తిగత జీవితంపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ 'పిల్లలు కావాలంటే నీ భార్యను నా దగ్గరకు పంపు' అని అన్నట్లు పేర్కొన్నారు. తన టీమ్ లీడర్లు తనతో బలవంతంగా నమాజ్ చేయించారని, కల్మా చదివించారని, స్కల్ క్యాప్ ధరింపజేశారని ఆ బాధితుడు ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు. వైద్య చికిత్స పొందుతు న్నప్పటికీ తన భార్యకు పిల్లలు కలగడంలేదన్న విషయంపై నిందితులు ఎగతాళి చేస్తూ, అత్యంత దారుణమైన మరియు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో తాను కంపెనీలో చేరగా.. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే వేధింపులు మొదలయ్యాయని ఆయన తెలిపారు. తన టీమ్ లీడర్ తౌసిఫ్ అక్తర్, సహోద్యోగి డానిష్ షేక్ తనను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. టీమ్ లీడర్ గా ఉన్న తౌసిఫ్.. తన మాట వినేలా చేయడానికి ఇతరుల పనిని కూడా తనపై వేసి, శారీరకంగా, మానసికంగా అలసిపోయేలా చేసేవాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఫిర్యాదులపై నాసిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే కొందరు కీలక వ్యక్తులను విచారించినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనలపై టీసీఎస్ యాజమాన్యం కూడా స్పందించింది. ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, అంతర్గత విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని ప్రకటించింది.

## రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్**

**ఆదిలాబాద్,తెలంగాణ దిశ:** రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచిం చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'రోడ్డు భద్రత అవగాహన' సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సూచిక బోర్డులు, హెచ్చరిక లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కేవలం చట్టాలు సరిపోవని, ప్రజల్లో ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపు అత్యంత అవసరమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం మానుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు (రెవెన్యూ) కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, రెవెన్యూ, రవాణా, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు, రోడ్లు-భవనాల శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### పిఠాపురానికి 'సెలక్షన్ గ్రేడ్' హోదా..

# పవన్ చొరవతో కీలక నిర్ణయం

- సెకండ్ గ్రేడ్ నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వుల జారీ
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో వేగంగా పూర్తయిన ప్రక్రియ
- హోదా పెంపుతో పెరగనున్న నిధులు.. మెరుగవనున్న మౌలిక వసతులు
- త్వరలో కమిషనర్‌గా గ్రూప్-1 స్థాయి అధికారి నియామకం




పిఠాపురం : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హోదా పెంపుతో పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం కానుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపినట్లు తెలుస్తోంది. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్, ప్రత్యేక అధికారి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. 2021 నుంచి 2025 వరకు మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాల రికార్డులను సమీక్షించిన అనంతరం, సెలక్షన్ గ్రేడ్‌కు అర్హత ఉందని నిర్ధారించి ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా రూ.8 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్న మున్సిపాలిటీలకు సెలక్షన్ గ్రేడ్ హోదా కల్పిస్తారు. ఈ హోదా పెంపుతో పిఠాపురం అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ఇకపై గ్రూప్-1 స్థాయి అధికారి కమిషనర్‌గా బాధ్యతలు చేపడతారు. మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు భారీగా అందనున్నాయి. తద్వారా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. 1957లో మున్సిపాలిటీగా ఏర్పడిన పిఠాపురం, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా దేవి శక్తిపీఠం, శ్రీపాద వల్లభుల ఆలయాలకు దేశవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. పెరిగిన జనాభా, భక్తుల రద్దీతో మున్సిపాలిటీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవల కాలంలో పిఠాపురం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే 'పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఏడీఏ)ని ఏర్పాటు చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ.37.25 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇప్పుడు మున్సిపాలిటీ హోదా పెంపుతో అభివృద్ధి మరింత ఊపందుకోనుంది.

# కార్పొరేట్ జీహాదీలో కొత్త కోణాలు

నాసిక్, : మహారాష్ట్రని కుదిపేసిన నాసిక్ బీపీవో లైంగిక వేధింపుల అంశంలో పోలీసులు చాలా పక్కాగా వ్యవహరించారు. దాదాపు 150మంది వరకూ పనిచేస్తున్న ఆ ఃఖూలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు రావడంతో నిజాన్ని నిర్ధారించుకోవడానికి పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ చేశారు. కొన్ని రోజులు అక్కడ పనిచేసి నిజాలు నిర్ధారించుకున్న తర్వాతే ఎఫ్ ఐఆర్ లు నమోదు చేశారు. మహారాష్ట్ర నాసిక్‌లోని మహిళా ఉద్యోగులపై వేధింపులు, ఉద్యోగ ప్రలోభాలు, మతపరమైన ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణలు రావడం సంచలనం రేకెత్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే తొమ్మది లు నమోదు కాగా ఏడుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఎక్కువ మంది ఓ మతానికి చెందిన వారుండటం, వారు బలవంతపు మతమార్పిడికి ప్రయత్నించారన్న ఫిర్యాదు రావడంతో విషయం సున్నితంగా మారింది. రైట్ వింగ్ రాజకీయ పార్టీలు ఇది లవ్‌జిహాద్‌లాగా కార్పోరేట్ జిహాద్ అని అభివర్ణించాయి. బలవంతపు మతమార్పిడిలకు కార్పోరేట్ ఆఫీసులను కూడా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే ఈ వ్యవహారం ముందుగా బయటకు వచ్చినప్పుడు.. విషయం సెన్సిటివ్ కావడంతో పోలీసులు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ముందుగా విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతనే యాక్షన్‌లోకి దిగారు. అసలు ఈ విషయంలో ఎప్పుడు బయటకు వచ్చిందంటే..టీసీఎస్ అనుబంధ ఃఖూలో పనిచేసే ఓ 20 ఏళ్ల హిందూ అమ్మాయి.. అక్కడ చేరిన కొన్నిరోజులకు తన మతపరమైన ఆచార వ్యవహారాలను మార్చుకుంది. ఆహార్యం, తన మతపరమైన గుర్తింపును మార్చుకునేందుకు ప్రయత్నించడంతో ఆమె తల్లిదండ్రులు ఆమె ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆఫీసులోనే ఏదో జరుగుతోందని ఈ ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ చాలా పేరున్న కంపెనీ.. ఆ సంస్థలో వ్యవహారం కావడం.. విషయం చాలా సున్నితమైంది కావడంతో పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించారు. అనుమానాన్ని నిర్ధారించుకునేందుకు టీసీఎస్ లో హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా కొంతమంది కానిస్టేబుళ్లు చేరారు. ఇందులో ఒకరిద్దరు మహిళా అధికారులు కూడా ఉన్నారని కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. దాదాపు 15 రోజులు అక్కడ నిఘా ఉంచి జరుగుతున్నది నిజమే అని నిర్ధారించుకు న్నారు. 2026 మార్చి 25న ఒక మహిళా ఉద్యోగి డెలాలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను 2022 నుంచి 2026 వరకూ సహచరుల చేత లైంగిక దోపిడీ, మతపరమైన వేధింపులు ఎదుర్కొన్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ముందుకు రావాలని కోరారు. దీంతో మరింత మరింత మంది బాధితులు బయటకు వచ్చారు కొద్ది రోజుల్లోనే కేసు పెద్దైంది. మొత్తం 9 ఎఫ్ ఐ ఆర్ లు నమోదయ్యాయి. 8మంది మహిళలు, ఓ పురుషుడు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నీ లైంగిక వేధింపులు, అత్యాచారం, బలవంతపు సంబంధాలు, స్టాకింగ్, బెదిరింపులు, మతపరమైన ఒత్తిళ్లు, మార్పిడి ప్రయత్నాలు , మతంపై దూషణలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఒకే మతానికి చెందిన వారు కావడంతో ఇది 'కార్పోరేట్ జిహాద్'గా మారింది.ఏడుగురు అరెస్ట్ చేయగా.. అరెస్టైన వారంతా టీమ్ లీడర్లు, హెచ్ ఆర్ అధికారులు ఉన్నారు వారంతా ఒకేమతానికి చెందిన వారు. అరెస్టైన వారిలో అసిఫ్ అంసారీ, షఫీ షేక్, షారుక్ ఖురేషీ, రజా మెమన్, తౌసిఫ్ అట్టార్, డానిష్ షేక్ ఉన్నారు. వీరితో పాటు.. ఉద్యోగినులు ఫిర్యాదు ఇచ్చినా కూడా పట్టించుకోని మహిళా ఏజీఎం ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో విషయం మతపరంగా మారిపోయింది. బీజేపీ దీనిని పక్కా ప్రణాళికతో చేసిన కార్పోరేట్ స్కాండల్ అంటోంది. నిందితుల తరపు లాయర్లు మాత్రం దీనిని అనవసరంగా సన్సేషనల్ చేస్తున్నారని.. విషయాన్ని పెద్దది చేసి చూపిస్తున్నారని కామెంట్ చేస్తున్నారు. ఆఫీసుల్లో జరిగిన సంభాషణల్లో వచ్చిన అభిప్రాయ భేదాలు, విభిన్న ఆలోచనలు, భావజాలల మధ్య అంతరాలే తప్ప.. బలవంతంగా ఏం జరగలేదని లాయర్లు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని టీసీఎస్ చాలా సీరియస్‌గా తీసుకుంది. అరెస్టైన ఉద్యోగులందరినీ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారాన్ని తాము చాలా తీవ్రంగా తీసుకుంటున్నామని ప్రకటించింది. పని ప్రదేశంలో బలవంతాలను నిరోధించే జీరో టాలరెన్స్ కు తాము కట్టుబడి ఉన్నామని ఇలాంటి విషయాలను ఏమాత్రం ఉపేక్షించని చెప్పింది. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కూడా ఇది తీవ్రంగా విచారించదగ్గ విషయమని..దీనిపై సంస్థ ఆర్తి సుబ్రమణియన్‌తో విచారణ జరిపిస్తున్నామని ప్రకటించారు.

## లక్ష్యాలను 100% సాధించడంలో సెర్ప్ సిబ్బంది కృషి చేయాలి



**స్త్రీనిధి రుణాల పంపిణీ రికవరీలో జిల్లా ముందుండాలి**

**వీ-హబ్ శిక్షణలతో మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** స్వశక్తి సంఘాల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను 100% సాధించడానికి సెర్ప్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘాల కవరేజ్‌లో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లాను ముందంజలో ఉంచేలా అందరూ కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రుణాల లక్ష్యాలను పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలనిజిల్లాలో మహిళ శిక్షణల సంస్థ విహబ్ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విహబ్ శిక్షణల కోసం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మహిళలను సమీకరించి శిక్షణలకు హాజరయ్యేలా సెర్ప్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సిబ్బంది అందరూ సమన్వయంతో కృషి చేసి అన్ని అంశాలలో జిల్లాను అగ్రభాగంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.కాలిందిని, అదనపు డి.ఆర్.డి.ఓ బి.రవీందర్, డిపిఎంలు వెంకటరమణ, సంజీవ్, స్త్రీనిధి ఆర్ఎం దుర్గాప్రసాద్, ఏపీఎంలు, స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వరరాగాల సుర సుర..



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల కలబోతగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమేనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నారు. 'సుర సుర' అంటూ సాగే ఈ పాటను.. సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందించారు.

జునైద్ కుమార్ అభే సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్స్‌గా నిలువనున్నాయి. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ ఈ పాటను ఆలపించగా, కాసర్ల శ్యామ్ రాశారు. ఈ సినిమాకే ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.


## నేను రఫ్ డాడ్ .. పిల్లల పెంపకంపై రామ్ చరణ్ ఆసక్తికర వ్యాఖ్యలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఆయన భార్య ఉపాసన కొణిదెల ప్రస్తుతం ముగ్గురు పిల్లలతో సంతోషకరమైన కుటుంబ జీవితం గడుపుతున్నారు. 2023లో జన్మించిన క్లింకాతో పాటు, 2026 జనవరిలో ఈ దంపతులకు కవలలు (ఒక బాబు, ఒక పాప) పుట్టిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి స్వయంగా మనవడు, మనవరాలికి 'శివ రామ్ కొణిదెల', 'అన్వీర దేవి కొణిదెల' అని నామకరణం చేసిన విషయం అభిమానులకు తెలిసిందే. ఈ పేర్లలో కుటుంబ భావోద్వేగాలు, సంప్రదాయం ప్రతిబింబిస్తాయని ఆయన అప్పుడే వెల్లడించారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రామ్ చరణ్, పిల్లల పెంపకంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను కొంచెం రఫ్‌గా ఉండే తండ్రిని. పిల్లలు పడిపోతే, మట్టిలో ఆడితే, ఎత్తుపల్లాలు ఎక్కినా నేను భయపడను. వాళ్లు ధైర్యంగా, సాహసంగా పెరగాలని కోరుకుంటాను" అని తెలిపారు. అదే సమయంలో, వారి తల్లి ఉపాసన చాలా సున్నితంగా, ప్రేమగా చూసుకుంటుంది. కానీ ఏదైనా రిస్క్ తీసుకోవాలంటే పిల్లలు నా దగ్గరికే వస్తారు అంటూ తన పెరెంటింగ్ స్టైల్‌ను వివరించారు. కుటుంబంతో గడిపే సమయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని రామ్ చరణ్ స్పష్టం చేశారు. స్టార్‌డమ్ ఎంత ఉన్నా, పిల్లలు పెరుగుతున్న సమయంలో వాళ్లతో ఉండటం చాలా ముఖ్యం. నా ప్రపంచం చాలా చిన్నది.. అది నా కుటుంబం, నా పెంపుడు జంతువుల చుట్టూనే తిరుగుతుంది అని చెప్పారు.

తన తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న విలువలను పిల్లలకు కూడా అందించాలని కోరుకుంటున్నానని చరణ్ వెల్లడించారు. షూటింగ్‌ల మధ్యలో విరామం దొరికినప్పుడల్లా పిల్లలతో గడపడానికి సమయం కేటాయిస్తున్నానని తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ ఒక పెహిల్వాన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్‌లో ఈ మూవీ విడుదల కావలసి ఉండగా, ఇంకా ప్రమోషన్ కార్యక్రమాలు మొదలు పెట్టలేదు. దీంతో చిత్ర రిలీజ్‌పై అనేక సందేహాలు ఉన్నాయి.

## రియల్ హీరో అనిపించిన శివ కార్తికేయన్..




### పరిచయం లేని నటుడికి ఏకంగా రూ.50 లక్షల సాయం

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ తన మంచి మనసుతో మరోసారి వార్తల్లో నిలిచాడు. సాధారణంగా తను చేసిన మంచి పనులను ఎక్కడా ప్రచారం చేసుకోని ఈ హీరో, అవసరంలో ఉన్నవారికి సైలెంట్‌గా సహాయం చేస్తుంటాడు. తాజాగా అలాంటి ఒక సంఘటన బయటకు రావడంతో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న శివ కార్తికేయన్, 'అమరన్' వంటి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందాడు. స్వయం కృషితో ఎదిగిన ఈ హీరోకు సామాజిక స్పృహ ఎక్కువగా ఉండటంతో, తన వంతు సహాయం చేస్తూ ఉంటాడు. ఇటీవల కోలీవుడ్ నటుడు ప్రేమ్ కుమార్ ఒక ఇంటర్వ్యూలో శివ కార్తికేయన్ చేసిన సహాయం గురించి వెల్లడించాడు. ఇద్దరూ కలిసి 'హీరో' సినిమాలో పనిచేసిన సమయంలో జరిగిన ఈ సంఘటనను ఆయన గుర్తు చేసుకున్నాడు. షూటింగ్ సమయంలో తన కుమారుడిని ఉన్నత విద్య కోసం నెదర్లాండ్స్ పంపాలనుకున్నప్పటికీ, అవసరమైన డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ప్రేమ్ కుమార్ తెలిపారు. ఇల్లు తాకట్టు పెట్టాలని భావించినా, అది ఈఎంఐలో ఉండటంతో బ్యాంకులు రుణం ఇవ్వడానికి నిరాకరించాయని చెప్పారు. ఈ విషయాన్ని శివ కార్తికేయన్‌కు చెప్పగా, వెంటనే స్పందించిన ఆయన తన పేరుపై పూచీకత్తుగా నిలిచి బ్యాంకు ద్వారా రూ.50 లక్షల రుణం ఇప్పించాడని ప్రేమ్ కుమార్ వెల్లడించాడు. ఈ సహాయం వల్ల తన కుమారుడు విదేశాల్లో చదువు పూర్తి చేసి, ప్రస్తుతం నెలకు రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నాడని తెలిపారు. అతనితో నాకు పెద్దగా పరిచయం కూడా లేదు. ఒక సినిమా మాత్రమే కలిసి చేశాం. అయినా సరే నా పరిస్థితిని అర్థం చేసుకుని ఇంత పెద్ద సాయం చేశారు. ఆయన నిజంగా గొప్ప మనసున్న వ్యక్తి అంటూ ప్రేమ్ కుమార్ ప్రశంసించారు.

ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిని చూసిన అభిమానులు శివ కార్తికేయన్‌ను 'రియల్ హీరో' అంటూ కొనియాడుతున్నారు. సినిమా విజయాలకే కాకుండా, మనసు మంచితనంతో కూడా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, హీరోగానే కాకుండా నిర్మాతగానూ బిజీగా ఉన్న శివ కార్తికేయన్, ఇటీవల 'తాయ్ కిళవి' చిత్రంతో నిర్మాతగా కూడా సక్సెస్ సాధించాడు.




## చింతామణి సొంత కథ



శ్రీరామ్, మహిమా గుప్త జంటగా నటిస్తున్న చిత్రం 'చింతామణి సొంతకథ'. ప్రేమ్‌రాజ్ దర్శకుడు. బి.రాజీవ్‌కుమార్, రాకేష్ కర్రె, డా.ఎన్వీరావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి ప్రభుత్వ చీఫ్ విప్ అద్దంకి దయాకర్ క్లాప్ ఇవ్వగా, జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమీషనర్ వందనకుమార్ కెమెరా స్విచాన్ చేశారు. సోషల్ యాక్టివిష్ట్ డా.శ్రీనివాస్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ని అందించారు. అతిథులంతా చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కథలోని స్ట్రాంగ్ కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాతలు చెప్పారు.

కమర్షియల్ పంథాలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇదని, ఇందులో భార్యభర్తల డ్రామా ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

## సంక్రాంతి 2027కి అనిల్ రావిపూడి మల్టీస్టారర్.. పట్టాలెక్కముందే అమ్ముడైందా?



టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మిషన్'గా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 2027 సంక్రాంతి బరిలోకి ఈసారి మల్టీస్టారర్ చిత్రంతో దిగేందుకు సిద్ధమవుతున్నారు.ఈ సినిమాలో వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటించనుండటం విశేషం. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ల విషయానికి వస్తే, కృతిశెట్టి ఒక కథానాయికగా ఫిక్స్ కాగా, మరో కీలక పాత్ర కోసం కీర్తి సురేష్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా కాస్టింగ్ మరింత బలంగా మారుతోంది.ఇంకా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ చిత్రం ఓటీటీ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ZEE5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అనిల్ రావిపూడి గత చిత్రాలకు ఓటీటీలో వచ్చిన ఆదరణ దృష్ట్యా ఈ డీల్ రికార్డు స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు విశాఖపట్నంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రతి సినిమా స్క్రిప్ట్‌ను వైజాగ్‌లోనే పూర్తి చేసే సెంటిమెంట్ ఉన్న అనిల్ రావిపూడి, ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేసినట్లు సమాచారం.త్వరలోనే షూటింగ్ ప్రారంభించి, సంక్రాంతి సీజన్‌లో మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీ, ఎమోషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్ హీరోల కలయిక, హిట్ డైరెక్టర్ కాంబో, భారీ ఓటీటీ డీల్ అన్నీ కలిసి ఈ సినిమాను ఇప్పటినుంచే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. కాగా, అనీల్ రావిపూడి ఇప్పటి వరకు తెరకెక్కించిన అన్ని చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించిన విషయం తెలిసందే.

## 100 శాతం బ్రో.. పవన్ కల్యాణ్ అభిమానికి బండ్ల గణేశ రిప్లై..!



కమెడియన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా, నిర్మాతగా తెలుగు ప్రేక్షకులకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు బండ్ల గణేశ్. పవన్ కల్యాణ్, బండ్ల గణేశ్ కాంబో అంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. జయంత్ సీ పరాన్జీ డైరెక్షన్‌లో పవన్ కల్యాణ్ నటించిన చిత్రం తీన్‌మార్. బండ్ల గణేశ్ నిర్మించారు. తీన్‌మార్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయినా మ్యూజికల్ హిట్‌గా నిలువడమే కాకుండా ఓ వర్గం ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అయిందనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో బండ్ల గణేశ్ ఈ సినిమాను కొన్ని మార్పులతో రీరిలీజ్ చేయాలని హామీనిచ్చాడు. ఇప్పుడిదే కమిట్‌మెంట్‌ను గుర్తు చేస్తున్నారు ఫ్యాన్స్. తీన్‌మార్ నేటితో 15 సంవత్సరాలుపూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నెట్టింట ఓ అభిమాని పవన్‌కల్యాణ్ బర్త్ డేసందర్భంగా తీన్‌మార్ రివైజ్‌డ్ వెర్షన్‌ను విడుదల చేయాలని బండ్ల గణేశ్‌కు సలహా ఇచ్చాడు. దీనికి బండ్ల గణేశ్ స్పందిస్తూ.. 100 శాతం బ్రో.. అని రిప్లై ఇచ్చాడు. ఈ రీట్వీట్‌తో తీన్‌మార్ మళ్లీ థియేటర్లలో సందడి చేయడం పక్కా అని మరోసారి క్లారిటీ వచ్చేసింది. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే అందించిన ఈ మూవీ ఒరిజినల్ రిలీజైన టైంలో ప్రత్యేకించి డబ్బింగ్ విషయంలో విమర్శలు వచ్చాయి. ఒకవేళ సినిమాలో కొన్నిమార్పుచేర్పులు చేసి రీరిలీజ్ చేస్తే మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశాలున్నాయంటున్నారు నెటిజన్లు..

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215